## క్లుప్తంగా

### యువతకు ఉగాది కవితల పోటీ

**బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ):** ఉగాది సందర్భంగా తూర్పు గోదావరి జిల్లా రచయితల సంఘం, వేణుగోపాల సంస్కృత ప్రచార సభల సంయుక్తాధ్వర్యంలో యువ కవితా పోటీలు నిర్వహిస్తున్నట్టు సంస్థ ప్రధాన కార్యదర్శి పి.చిరంజీవినీ కుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలకు 35 ఏళ్లలోపు యువ కవులు అర్హులన్నారు. కవితలను వాట్సాప్ 94915 04045కు ఈ నెల 22వ తేదీలోగా పంపాలన్నారు. నవ వసంతం–నవ మానవుడు అనేది కవిత ఇతివృత్తంగా ఉండాలన్నారు. కవితలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులిస్తామని చెప్పారు. కొందరు కవులతో కవి సమ్మేళనం నిర్వహిస్తున్నామన్నారు. మరిన్ని వివరాలకు సీహెచ్ సుబ్బారావు సెల్: 98667 33293, సరిపెల్ల శ్రీరామచంద్రమూర్తి సెల్: 94415 63789ని సంప్రదించవచ్చని తెలిపారు.

### నూకాలమ్మ హుండీల లెక్కింపు

**బోట్‌క్లబ్:** నగరంలోని సూర్యారావుపేటలో ఉన్న నూకాలమ్మ అమ్మవారి హుండీలను బుధవారం దేవదాయ శాఖ అధికారులు సమక్షంలో లెక్కించారు. 99 రోజుల వ్యవధికి రూ.1.85 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ ఉండవల్లి వీర్రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ తలాటం సత్యనారాయణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### ఉచిత కంటి పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

**బోట్‌క్లబ్:** కళ్లద్దాలు వాడుతున్న వారు క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలని ప్రముఖ కంటి వైద్య నిపుణురాలు అడపా మోనికా తెలిపారు. ప్రపంచ గ్లాకోమా దినాన్ని పురస్కరించుకుని స్థానిక వాసన్ కంటి ఆస్పత్రిలో బుధవారం ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కుటుంబంలో ఎవరికైనా గ్లాకోమా ఉన్నా, మందపాటి కళ్లద్దాలు వాడుతున్నా తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ వ్యాధిని ముందుగానే పరీక్షల ద్వారా తెలుసుకోవచ్చన్నారు. చూపు కోల్పోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్లాకోమా పరీక్షలు ఈ నెల 15వ తేదీ వరకు ఉచితంగా చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బ్రాంచ్ మేనేజర్ స్వామి తెలిపారు.

### పేద మహిళలకు వస్త్రాల పంపిణీ



పేద మహిళలకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న సభ్యులు

**కాకినాడ రూరల్:** రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ కార్యాలయం వద్ద బుధవారం పేద మహిళలు, వృద్ధులకు సోమలంక త్యాగరాజు వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధి జి.కృష్ణమోహన్ మాట్లాడుతూ, పేదలకు వస్త్ర, అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సాహితీవేత్త డాక్టర్ శిరీష, అడబాల రత్నప్రసాద్, బుద్ధరాజు సత్యనారాయణరాజు, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, రాజా తదితరులు పాల్గొన్నారు.

### పరారీలో ఉన్న హెచ్‌ఎంను అరెస్ట్ చేయాలి

- మానవ హక్కుల వేదిక డిమాండ్

**కరప:** విద్యార్థినులను వేధింపులకు గురిచేసిన హెచ్‌ఎం అడబాల కాశీవిశ్వేశ్వరరావుపై పోక్సో కేసు నమోదైనా, తప్పించుకుని తిరుగుతున్నాడని, పోలీసులు వెంటనే అరెస్ట్ చేసేలా చర్యలు తీసుకోవాలని మానవ హక్కుల వేదిక డిమాండ్ చేసింది. మండలంలోని గొర్రిపూడి జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం కాశీవిశ్వేశ్వరరావు విద్యార్థినులను వేధింపులకు గురిచేసినట్టు నిర్ధారణ కావడంతో అతనిపై సస్పెన్షన్ వేటు వేసి, పోక్సో కేసు నమోదు చేసిన విషయం విదితమే. ఈ ఘటనపై మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రవి, ప్రధాన కార్యదర్శి వై.రాజేష్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు ఎం.ఇక్బాల్ బుధవారం గొర్రిపూడిలో పర్యటించారు. బాధిత కుటుంబీకులను, గ్రామస్తులను, పాఠశాల ఉపాధ్యాయులను, పోలీసు అధికారులను కలిసి వాస్తవాలను సేకరించారు. ఈ సందర్భంగా వేదిక ప్రతినిధులు విలేకరులతో మాట్లాడారు. వేధింపులకు గురైన విద్యార్థినుల ఫిర్యాదు మేరకు కరప పోలీసు స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైందని, పరారీలో ఉన్న నిందితుడిని ఇంతవరకు అరెస్ట్ చేయలేదన్నారు. బాధిత విద్యార్థినులు ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన వారని, నిందితుడు తనకున్న సామాజిక, ఆర్థిక బలంతో సాక్షులను ప్రభావితం చేసి, కేసును నీరుగార్చే ప్రయత్నిస్తారని బాధితులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. విచారణలో అలసత్వం వల్ల పోక్సో కేసులు వీగిపోయి, నిందితులు చట్టం నుంచి తప్పించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిందితుడిని తక్షణమే అరెస్ట్ చేసి, కేసును త్వరితగతిన విచారణ చేసి, నిందితుడికి చట్టప్రకారం శిక్ష పడేలా చర్యలు చేపట్టాలని కోరారు.

# విద్యార్థులపై 'కూటమి' నిర్లక్ష్యం

- వైఎస్సార్ సీపీ 'యువత పోరు'లో మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి
- పార్టీ కార్యాలయంలో ఘనంగా ఆవిర్భావ దినోత్సవం




కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళుతున్న ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, వంగా గీత, దాడిశెట్టి రాజా, అనంతబాబు, దవులూరి దొరబాబు, ముద్రగడ గిరి తదితరులు



కాకినాడలో పార్టీ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖర్ రెడ్డి, నాయకులు

**బాలాజీచెరువు:** వివిధ వర్గాలకు చెందిన విద్యార్థుల పట్ల కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని కాకినాడ మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ సిటీ కో–ఆర్డినేటర్ ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా కలెక్టరేట్ వరకు పార్టీ శ్రేణులు, వివిధ వర్గాల ప్రజలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ, విద్యా దీవెన, వసతి దీవెనకు సంబంధించి గతేడాది రూ.3,200 కోట్లు బకాయిలు ఉండగా, ఈ ఏడాదితో కలిపి రూ.7,100 కోట్లు రావాల్సి ఉందన్నారు. బడ్జెట్‌లో కేవలం రూ.2,644 కోట్లు కేటాయించి, లక్షలాది విద్యార్థులను మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. ముఖ్యంగా ప్రతి నెలా రూ.3 వేల నిరుద్యోగ భృతి చెల్లిస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చి 9 నెలలు గడిచినా ఒక్క రూపాయి చెల్లించలేదన్నారు. వైద్య విద్య కోసం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గత ప్రభుత్వ హయాంలో 17 కళాశాలలు ప్రారంభిస్తే, ఆ కళాశాలలకు సీట్లు వద్దని కేంద్రానికి లేఖ రాసిన ఘనత చంద్రబాబుదని విమర్శించారు.

**ప్రజల కష్టాల నుంచి పుట్టిన పార్టీ**

వైఎస్సార్ సీపీ ప్రజల కష్టాల నుంచి పుట్టిన పార్టీ అని మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. స్థానిక బాలాత్రిపుర సుందరి ఆలయం వద్ద ఉన్న వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పార్టీ నగరాధ్యక్షురాలు, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ, ఎన్నో ఒడిదుడుకులు, కష్టాలను ఎదుర్కొని, అధికారాన్ని చేపట్టి, ప్రజాభిమానాన్ని చూరగొన్న పార్టీ వైఎస్సార్ సీపీ అని వివరించారు. కౌడా మాజీ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి మాట్లాడుతూ, ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించేలా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చేసి, పార్టీ పటిష్టతను దేశవ్యాప్తంగా చాటిచెప్పారన్నారు. పార్టీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న మాట్లాడుతూ, వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి ప్రజాక్షేత్రంలో ప్రజల మన్ననలు చూరగొని, దేశ చరిత్రలోనే సువర్ణాక్షరాలతో లిఖించదగేలా పార్టీ ప్రతిష్టను ఇనుమడింపజేసిన ఘనత మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, మాజీ మేయర్ పోల్నపల్లి సరోజ, రాష్ట్ర ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి రావూరి వెంకటేశ్వరరావు, ద్వారంపూడి చారిటబుల్ ట్రస్ట్ ఆర్గనైజర్ కర్రి వీర్రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి, స్వీట్లు పంచారు. వైఎస్సార్ సీపీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పార్టీ పిలుపుమేరకు యువత పోరు కార్యక్రమంలో భాగంగా జిల్లావ్యాప్తంగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలతో కలిసి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లారు.

# భవిష్యత్తు మళ్లీ వైఎస్సార్ సీపీదే..

- పార్టీ శ్రేణుల వెల్లడి
- పండగలా పార్టీ ఆవిర్భావ వేడుకలు



రమణయ్యపేటలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు



రమణయ్యపేట వైద్యనగర్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో కురసాల సత్యనారాయణకు కేక్ తినిపిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ

**కాకినాడ రూరల్:** వైఎస్సార్ సీపీ ఆవిర్భావ వేడుకలు బుధవారం కాకినాడ రూరల్‌లో ఘనంగా జరిగాయి. పార్టీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్, మాజీ మంత్రి కురసాల కన్నబాబు ఆదేశాల మేరకు ఆయన నివాసం వద్ద పార్టీ కార్యాలయంలో వేడుకలు పండగను తలపించాయి. నియోజకవర్గ పరిధిలోని కాకినాడ రూరల్, కరప మండలాలతో పాటు, అర్బన్‌లోని ఎనిమిది డివిజన్ల నుంచి తరలివచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల నడుమ సీనియర్ నాయకుడు కురసాల సత్యనారాయణ ఆధ్వర్యంలో సంబరంగా ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, కురసాల సత్యనారాయణ, తిమ్మాపురం సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి, అందరికీ తినిపించారు. ఈ సందర్భంగా నేతలు కురసాల సత్యనారాయణ మాట్లాడుతూ, వైఎస్సార్ సీపీ కోసం అహర్నిశలు పాటుపడుతున్న ప్రతి కార్యకర్త, అభిమానులు, నాయకులకు కన్నబాబు శుభాకాంక్షలు తెలిపారన్నారు. జెడ్పీటీసీ రామకృష్ణ మాట్లాడుతూ, ప్రజారంజక పాలనను వైఎస్సార్ సీపీ హయాంలో అందించిందని, సంక్షేమానికి నిలువెత్తు నిదర్శనంగా పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారన్నారు. అన్ని వర్గాల ప్రజలు సంక్షేమ లబ్ధి పొందారని, మళ్లీ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తుందన్నారు. సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ మాట్లాడుతూ, యువజన, శ్రామిక, రైతులు, విద్యార్థులు, అన్ని వర్గాల ప్రజలకు అండగా వైఎస్సార్ సీపీ నిలుస్తుందన్నారు. భవిష్యత్తు వైఎస్సార్ సీపీదే అన్నారు. పార్టీ ఆవిర్భావం తర్వాత ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. ప్రజల కోసం నిత్యం పరితపిస్తూ, వారికి అండగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జి జమ్మలమడక నాగమణి, నాయకులు గోపుశెట్టి బాబ్జీ, పుల్ల చందు, కొల్లు బోయిన భవాని, నల్ల రాణి, గంపల సత్యనారాయణ, భువనేశ్వరి, ఇసుకపల్ల లక్ష్మికుమారి, ఊబ శ్రీను, పల్లంరాజు, అనుసూరి ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

# పేదరికం లేని సమాజమే లక్ష్యం

- కలెక్టర్ షణ్మోహన్

**కాకినాడ సిటీ:** ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పేదరికం లేని సమాజ నిర్మాణమే లక్ష్యంగా పబ్లిక్, ప్రైవేట్, పీపుల్ పార్టనర్‌షిప్ (పీ4) సర్వేకు రూపకల్పన చేశారని కలెక్టర్ షణ్మోహన్ సగిలి తెలిపారు. జిల్లాలో ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బందితో పీ4 సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. పీ4 పాలసీపై ప్రజలు తమ విలువైన అభిప్రాయాలను తెలియజేయాలన్నారు. ఈ నెల 25లోపు స్వర్ణాంధ్ర లింక్, క్యూఆర్ కోడ్ ద్వారా ప్రజలు తమ అభిప్రాయాలు తెలియజేయాలని కోరారు. ఈ సందర్భంగా పీ4కు సంబంధించి పోస్టర్‌ను, క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. పేదల అవసరాలను గుర్తించి, వారి సమగ్రాభివృద్ధికి అవసరమైన ప్రాజెక్టుల రూపకల్పనకు సర్వే దోహదం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ రాహుల్ మీనా, డీఆర్వో జె.వెంకటరావు, సీపీవో పి.త్రినాథ్, జెడ్పీ సీఈవో లక్ష్మణరావు, డీపీఓ వి.రవికుమార్, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి జి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

- ఆర్డీవో మల్లిబాబు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో మల్లిబాబు

**కాకినాడ సిటీ:** నిర్దేశించిన మండలాల్లో భూముల రీ సర్వే సమగ్రంగా నిర్వహించాలని కాకినాడ ఆర్డీవో ఎస్ మల్లిబాబు తహసీల్దార్లను ఆదేశించారు. బుధవారం ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రెవెన్యూ చట్టాలపై సంపూర్ణ అవగాహన పెంచుకోవాలన్నారు. ఇళ్ల స్థలాలకు సంబంధించి పూర్తిస్థాయి విచారణ చేసి, నివేదిక రూపొందించాలన్నారు. తహసీల్దార్ కార్యాలయాలకు ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థలో వచ్చిన విజ్ఞాపనలను నిర్ణీత గడువులోగా పరిష్కరించే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా ఆర్ఓఆర్, పీఓటీ ఆక్రమణ కేసులకు సంబంధించి ఓఆర్‌సీఎంఎస్ వెబ్‌సైట్‌లో పాత, కొత్త కేసులు పొందుపరచాలని చెప్పారు. దీనిపై పూర్తి స్థాయి అవగాహన పెంచుకోవడానికి డివిజన్‌లో తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లతో శిక్షణా కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిపాలనాధికారి డీబీఏ చైనులు, వి.జితేంద్ర, ఎస్ఎల్ఎన్ కుమారి, పి.త్రినాథరావు, కె.చిన్నారావు, జీఆర్ ఠాగూర్, కె.సత్యనారాయణ, ఎన్.సత్యనారాయణ, కె.చంద్రశేఖరరెడ్డి, రాంకుమార్, కృష్ణసౌజన్య, రామచంద్రారెడ్డి, గోవిందు, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

**బోట్‌క్లబ్:** అన్నమ్మఘాటి విద్యుత్ ఉపకేంద్రం అభివృద్ధి పనులు, వార్షిక మరమ్మతుల్లో భాగంగా గురువారం మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకూ కోసం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ డీఈ ఉదయభాస్కర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపకేంద్రం పరిధిలోని నరసింహరోడ్, శివాలయం వీధి, తారకరామ నగర్, ఘాటీ సెంటర్, కొవ్వూరు రోడ్, సుందర్ నగర్, పప్పుల మిల్లు ఏరియా, రిక్షాలపేట, పరదేశమ్మపేట, ప్రసాదరావు నగర్, సత్యదేవి నగర్, ముగ్గపేట, రెల్లిపేట, బాపూజీ నగర్, పద్మనాభ నగర్, మేకా నారాయణమ్మ తోట, కాపుల వీధి, మున్సబుగారి జంక్షన్, కొవ్వూరు, డి–మార్ట్, శుభం కౌంటీ, తూరంగి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని వివరించారు.

**రేపు డి4 సెక్షన్ పరిధిలో..**

**కాకినాడ రూరల్:** కాకినాడ డి4 సెక్షన్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎస్.ఉదయ్ భాస్కర్ తెలిపారు. వార్షిక మరమ్మతుల కోసం 33/11కేవీ వలసపాకల సబ్ స్టేషన్ పరిధిలోని, 11కేవీ గంగరాజునగర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. గంగరాజునగర్–1 నుంచి 6 రోడ్ల వరకు, కృష్ణ టెంపుల్, సింహాద్రినగర్ ఏరియా, గానుగ చెట్టు సెంటరు, శ్రీకాంత్ పబ్లిక్ స్కూల్, కాకినాడ పబ్లిక్ స్కూల్ ఏరియాలకు అంతరాయం కలుగుతుందన్నారు.

# రచ్చబండలో మంత్రికి సమస్యల హారం

**కాకినాడ రూరల్:** అధికారులతో కలిసి చేపట్టిన రచ్చబండ కార్యక్రమం 'కూటమి' మంత్రికి చుక్కలు చూపించింది. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి సమస్యలతో సతమతమవుతున్న ప్రజలు మంత్రికి 'సమస్యల హారం'తో స్వాగతించారు. వివరాల్లోకి వెళితే.. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ బుధవారం కాకినాడ రూరల్ మండలం పండూరు గ్రామంలో సత్తెమ్మ గుడి వద్దఉన్న రావి చెట్టు కింద రచ్చబండ నిర్వహించారు. చిన్నాచితకా సమస్యలే ఉంటాయనుకుని అంతా భావించారు. ఒక్క పండూరు గ్రామానికి చెందిన వారే ఎక్కువగా పింఛన్లు, డ్రైనేజీలు, రోడ్ల నిర్మాణాలు, ఆధార్ ఇబ్బందులు, శ్మశాన వాటిక, ఊర చెరువు అభివృద్ధి, వాకింగ్ ట్రాక్ సమస్యలు ఇలా.. సమస్యల చిట్టాను ఆయన ముందుంచారు. తన స్థలం కబ్జాకు యత్నిస్తున్నారని ఓ వృద్ధురాలు మంత్రికి వినతిపత్రం అందించారు. ఏపీఐఐసీ కాలనీకి సేకరించిన మిగులు భూములు తిరిగి తమకు అప్పగించాలని తమ్మవరం రైతులు వేడుకున్నారు. సమస్యలు కోకొల్లలుగా వచ్చిపడడంతో, మంత్రి తన ప్రసంగాన్ని అందుకున్నారు. కొత్త పింఛన్లు, రేషన్ కార్డులు వచ్చే నెల నుంచి ఇస్తామని ప్రకటించారు. వాకింగ్ ట్రాక్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. తమ ప్రభుత్వం త్వరలో కార్యక్రమాలు చేయనుందంటూ చేసిన ప్రసంగంపై గ్రామస్తులు పెదవివిరిచారు. రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, జేసీ రాహుల్ మీనా, తహసీల్దార్ కుమారి, ఎంపీడీఓ సతీష్ పాల్గొన్నారు.

# సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన



వేళంగి హైస్కూల్‌కు కుర్చీలను అందజేస్తున్న లయన్స్ ప్రతినిధులు



సీపీఆర్ ప్రక్రియపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ కామేశ్వరరావు

**కరప:** ఎవరికైనా శ్వాస తీసుకోవడంలో ఇబ్బందికరంగా ఉండి, గుండె ఆగిపోయినట్టుగా ఉంటే వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లేలోపు ప్రాథమిక చికిత్సగా సీపీఆర్(కార్డియో పల్మనరీ రిససిటేషన్) ప్రక్రియ నిర్వహిస్తే మనిషి బతికే అవకాశాలుంటాయని కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీ, అమలాపురం కిమ్స్ మెడికల్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సి.కామేశ్వరరావు అన్నారు. వేళంగిలోని మెర్లాస్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం వేళంగి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చుండ్రు వెంకన్నారావు ఆధ్వర్యంలో విద్యార్థులతో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సీపీఆర్ ప్రక్రియను మనిషి బొమ్మల ఆధారంగా ప్రయోగాత్మకంగా చూపించి, విద్యార్థులతో కూడా చేయించారు. ఈ సందర్భంగా వేళంగి లయన్స్ క్లబ్ సమకూర్చిన రూ.82 వేల విలువైన 100 కుర్చీలను క్లబ్ మాజీ గవర్నర్ డాక్టర్ బాదం బాలకృష్ణ ద్వారా హైస్కూలుకు అందజేశారు. హెచ్ఎం భారతి, క్లబ్ సభ్యులు డాక్టర్ బొండా వెంకన్నారావు, డాక్టర్ బొండా సూర్యారావు, ఇళ్ల ఆదేశ్, బొడ్డు భాస్కరరామన్, మెర్ల రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# పొగాకు ఉత్పత్తులతో అనారోగ్య సమస్యలు

**బోట్‌క్లబ్:** ప్రస్తుతం పొగాకు ఉత్పత్తుల కారణంగా అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ అధ్యక్షుడు వీవీ రావు అన్నారు. ప్రపంచ ధూమపాన నిషేధ దినోత్సవం సందర్భంగా అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఆనందభారతి వద్ద ఉన్న రవి దంత వైద్యశాలలో బుధవారం పొగాకు ఉత్పత్తులతో కలిగే దుష్ప్రభావాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారం పొగాకు వాడకం వల్ల ఏటా 8 మిలియన్లకు పైగా ప్రజలు మరణిస్తున్నారని చెప్పారు. ఇందులో 7 మిలియన్లకు పైగా ప్రత్యక్ష పొగాకు వాడకం వల్ల, దాదాపు 1.2 మిలియన్ల మరణాలు తంబాకు, ఖైనీ, గుట్కా వంటివి సేవించడం వల్ల సంభవిస్తున్నాయని వివరించారు. సంఘ రాష్ట్ర కార్యదర్శి అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ, ధూమపానం, ఇతర రకాల పొగాకు ఉత్పత్తులు తీసుకోవడం వల్ల ఆ వ్యక్తికే కాకుండా, అతని కుటుంబం కూడా ప్రమాదంలో పడుతుందన్నారు. దగ్గు, గొంతు చికాకు ధూమపానం తొలి లక్షణాలని, ఇది ఊపిరితిత్తుల క్యాన్సర్, గుండె జబ్బులు, న్యుమోనియా తదితర వాటికి కారణమవుతుందన్నారు. ఇది శరీరాన్ని ఎలా హాని కలిగిస్తుందో ప్రజలు అవగాహన చేసుకోవాలని కోరారు. ధూమపాన అలవాటు ఉన్న వారు వీలైనంత త్వరగా ధూమపానం మానేయడానికి ప్రయత్నించాలని విజ్ఞప్తి చేశారు.

# ప్రమాద రహిత రైల్వేగా తీర్చిదిద్దాలి

- దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్
- సామర్లకోట రైల్వే స్టేషన్ తనిఖీ



సామర్లకోట రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనులను జీఎం అరుణ్‌కుమార్ జైన్‌కు వివరిస్తున్న డీఆర్ఎం పాటిల్

**సామర్లకోట:** రైల్వే శాఖ సిబ్బంది ప్రతి ఒక్కరూ తమ విధులను సక్రమంగా నిర్వహించి ప్రమాదాల రహిత రైల్వేగా తీర్చిదిద్దాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ ఆదేశించారు. సామర్లకోట రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. కాకినాడ నుంచి ప్రత్యేక రైలులో సామర్లకోట వచ్చిన ఆయన రైల్వే భద్రతకు సంబంధించిన పనులను పరిశీలించారు. కాకినాడ–సామర్లకోట రైల్వే స్టేషన్ల మధ్యలో ఎల్‌సీ గేటును రైలును ఆపి పరిశీలించారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్ కె.పద్మజ గేటును నిశిత పరిశీలన చేశారు. అనంతరం మూడో నంబరు ప్లాట్‌ఫారం నుంచి ఒకటో నంబరు ప్లాట్‌ఫారాలను జీఎం పరిశీలించారు. మూడో నంబరు ప్లాట్‌ఫారంపై దిగిన జీఎంకు రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ స్వాగతం పలికారు. ప్లాట్‌ఫారాలపై ఉన్న లిఫ్టును పరిశీలించడంతో పాటు, దాని సామర్థ్యాన్ని అడిగి తెలుసుకున్నారు. ఒకటో నంబరు ప్లాట్‌ఫారంలో స్టేషన్ మేనేజర్ కార్యాలయాన్ని పరిశీలించారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రైల్వే సూపరింటెండెంట్ కార్యాలయంలోని సిగ్నల్ వ్యవస్థను పరిశీలించి, డ్యూటీలో ఉన్న ఎస్ఎస్ అనంతలక్ష్మిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. సిగ్నల్ వ్యవస్థలో లోపాలు లేకుండా చూడాలని ఆదేశించారు. రైల్వే స్టేషన్ ఆవరణలో జరుగుతున్న ఆర్చి పనులను, వివిధ కార్యాలయాల పనులను, మరుగుదొడ్ల నిర్మాణాలను పరిశీలించారు. స్టేషన్‌కు మంజూరైన రూ.25.37 కోట్ల అమృత్ భారత్ నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలను జీఎంకు డీఆర్ఎం నరేంద్ర ఆనంద్ పాటిల్ వివరించారు. రైల్వే స్టేషన్ ఆవరణ విశాలంగా ఉండే విధంగా తయారు చేసిన స్థానిక సిబ్బందిని జీఎం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన ఉన్నతాధికారులకు అనేక సూచనలు ఇచ్చారు. ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా, తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అభివృద్ధి పనులతో ప్రయాణికులకు అసౌకర్యం లేకుండా చూడాలని సూచించారు. అభివృద్ధి పనులకు సంబంధించిన మ్యాప్, ఫొటో ఎగ్జిబిషన్‌ను ఆయన పరిశీలించారు. ప్రిన్సిపల్ చీఫ్ సేఫ్టీ ఆఫీసర్ కె.వెంకట రమణరెడ్డి, సీనియర్ కమర్షియల్ మేనేజర్ బి.రవిచందర్, ప్రిన్సిపల్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ బీరజ్ మోహన్ మీనా, ప్రిన్సిపల్ చీఫ్ సెక్షన్ టెలికం ఇంజినీర్ మురళీకృష్ణ, సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ నరేంద్ర వర్మ, డివిజనల్ కమర్షియల్ మేనేజర్లు రాంబాబు, ఆలీఖాన్, సీనియర్ డీఈఎన్‌లు గౌతమ్, ఎం.కిశోర్, సీనియర్ డీఈఈ సురేష్‌బాబు, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ సంతోష్‌కుమార్, స్థానిక అధికారులు ఏఈడీఎన్ బి.శివప్రసాద్, సీనియర్ సెక్షన్ ఇంజినీర్లు(వర్క్స్) రవికాంత్, రామసుబ్బారావు(పీడబ్ల్యూఐ) ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కేవీ గిరి, చీఫ్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ కల్యాణి, ఆర్పీఎఫ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### రైల్వేస్టేషన్‌ను పరిశీలించిన జీఎం

**బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ):** కాకినాడ రైల్వేస్టేషన్‌ను బుధవారం దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ పరిశీలించారు. కాకినాడ పోర్ట్ రన్నింగ్ రూమ్‌లో తనిఖీ చేశారు. అక్కడ ఆయన లోకో సిబ్బందికి అందుబాటులో ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. సిబ్బంది, సభ్యులతో సంభాషించారు. పచ్చని వాతావరణాన్ని ప్రోత్సహించడానికి ఆయన రన్నింగ్ రూమ్ వద్ద మొక్కలు నాటారు. లెవెల్ క్రాసింగ్ గేట్ నంబర్ 368ను తనిఖీ చేసి, అక్కడ భద్రతా అంశాలను సమీక్షించారు. అధికారిక రికార్డులను పరిశీలించారు. ఆయనతో పాటు, డివిజనల్ రైల్వే మేనేజర్ నరేంద్ర పాటిల్ ఉన్నారు.

### లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

**ఏలూరు టౌన్:** ఓవర్‌టేక్ చేయబోయి లారీని ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో 11 మందికి గాయాలైన ఘటన ఏలూరులో జాతీయ రహదారిపై బుధవారం వేకువజామున చోటుచేసుకుంది. కాకినాడ డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సు మంగళవారం రాత్రి కాకినాడ నుంచి గుంటూరుకు బయలుదేరింది. బుధవారం వేకువజామున సుమారు 4.30 ప్రాంతంలో ఏలూరు జాతీయ రహదారిలోని రామచంద్ర ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో ముందు వెళుతున్న లారీని బస్సు డ్రైవర్ ఓవర్‌టేక్ చేయబోయాడు. బస్సు అదుపు తప్పి లారీ వెనుక భాగాన్ని ఢీకొంది. ఆ సమయంలో బస్సులో 15 మంది ప్రయాణికులు ఉండగా, 10 మందికి స్వల్ప గాయాలయ్యాయి. బస్సు డ్రైవర్ క్షేమంగా ఉండగా, లారీ డ్రైవర్ కడియం రామశేషుతో పాటు, బస్సులోని 10 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. వీరిలో కాకినాడకు చెందిన సత్యసాయి, రావులపాలేనికి చెందిన కర్రి హారిక, మాచవరానికి చెందిన వి.రాజు, కాకినాడకు చెందిన సుబ్రహ్మణ్యం, కె.సురేష్, జె.పవన్‌కుమార్, రామచంద్రపురానికి చెందిన వెంకటలక్ష్మి, తణుకు ప్రాంతానికి చెందిన ఆరేపల్లి సాయి దుర్గాప్రసాద్, గుంటూరుకు చెందిన వి.దత్తు నాయక్, కడియపులంకకు చెందిన ఆకుల శివాజీ ఉన్నారు. క్షతగాత్రులను ఏలూరు జీజీహెచ్‌లో ప్రాథమిక చికిత్స అందించారు.